క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 50 వేల విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గుడివాడ మండలం బేతపూడికి చెందిన తుర్లపాటి హరిప్రసాద్ ఆదివారం రూ. 50,400 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం

ద్వారకాతిరుమల : చిన్నతనం నుంచే విద్యార్థులు ధ్యానం చేయడం అలవరచుకోవాలని వైద్య, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్ కుమార్ అన్నారు. ద్వారకాతిరుమల శివారులోని శ్రీ శ్రీనివాస స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమీలో ఆదివారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతాప్ కుమార్ వారికి పలు సూచనలు, సలహాలనిచ్చారు. ధ్యానం చేయడం ద్వారా అన్ని రుగ్మతలు తొలగిపోతాయన్నారు. అలాగే మానసిక ఉల్లాసం, ఆధ్యాత్మిక భావనలు పెంపొందుతాయన్నారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేశారు.

నాట్య విద్యార్థులకు ప్రమాణ పత్రాల అందజేత

జంగారెడ్డిగూడెం : కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు రోటరీ ముందుంటుందని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు దాకారపు కృష్ణ, ఉడా రాంగోపాల్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ధనకుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో మయూర నాట్యాలయ నాట్య విద్యార్థులకు ఆదివారం ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న ఛత్తీస్‌ఘడ్ యూనివర్సిటీ నుంచి ప్రవేశిక పరీక్షలో తమ నాట్య విద్యార్థులు ఉత్తీర్ణులై ప్రమాణ పత్రాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేశారు. అలాగే నాట్యాగురువు కళాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ త్వరలో రోటరీ ఆధ్వర్యంలో రోటరీ ఎక్సలెన్స్ అవార్డును అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాకారులు సుబ్బయాచారి, తిప్పాబొట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో భూముల రీసర్వే

- రైతులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేస్తున్న సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కొమడవోలు పరిసరాల్లో భూములను పరిశీలిస్తున్న సిబ్బంది



మాదేపల్లి శివారులో రోవర్ సర్వే పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు వరంగా మారింది. ఏళ్ల తరబడి రైతులను పట్టి పీడిస్తున్న సమస్యలు పరిష్కరించబడుతున్నాయి. ఏలూరు మండల విలీన గ్రామాలైన చొదిమెళ్ల, వెంకటాపురం, కొమడవోలు, పోనంగి, సత్రంపాడు, శనివారపుపేట, తంగెళ్లమూడిలో కొద్దిరోజులుగా రెవెన్యూ సిబ్బంది భూములు పరిశీలన చేస్తున్నారు. రైతులకు ఫోన్ చేసి కార్యాలయానికి పిలుస్తున్నారు. రైతుల వద్ద ఉన్న భూమి డాక్యుమెంట్ , లింక్ డాక్యుమెంట్, ఆధార్, పాస్‌బుక్, బ్యాంక్ బుక్స్ పరిశీలిస్తున్నారు. అనంతరం మరుసటి రోజు రైతుతో కలిసి ఫీల్డ్‌కి వెళుతున్నారు. అక్కడ రైతు సమక్షంలో భూమి సరిహద్దులు గుర్తిస్తున్నారు. అన్ని సక్రమంగా ఉంటే భూమి సాగుదారుడిగా పంటభూమిలోనే రైతు ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పొరపాట్లు ఉంటే మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

సమస్యలు.. పరిష్కారం

రీసర్వేలో వెలుగు చూస్తున్న సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారు. రికార్డుల్లో దొర్లిన తప్పులు, యజమానుల పేర్ల మార్పు, సరిహద్దుల గుర్తింపు, సాగుదారుల నిర్ధారణ, డాక్యుమెంట్ సవరణ, పాస్‌బుక్స్‌లో తప్పులు సరిదిద్దడం. ఇలా ఏ సమస్యనైనా అధికారులు సరి చేస్తున్నారు. ఒక్కపైసా ఖర్చు లేకుండా రైతులు మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకోగానే సమస్యలు పరిష్కరిస్తున్నారు. గతంలో మ్యూటేషన్ కోసం రైతులు నెలలు తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నేడు కానరావడం లేదు. అధికారులు, కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి ఇప్పుడు లేదని రైతులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

ప్రతి రైతుకు ప్రత్యేక నెంబర్...!

అధికారులు డ్రోన్ సర్వే, రోవర్ సర్వే పూర్తి చేసి, సరిహద్దు రాళ్లు వేయగానే ప్రభుత్వం ప్రతి రైతుకు ఒక ప్రత్యేక నెంబర్ కేటాయిస్తుందని అధికారులు చెబుతున్నారు. రైతుకు సంబంధించిన భూమి మొత్తం వివరాలు ఈ నెంబర్‌తో అనుసంధానమౌతాయన్నారు. సదరు రైతు ఈ నెంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డుల పరిశీలన చేస్తే భూమి మొత్తం వివరాలు కనిపిస్తాయని చెబుతున్నారు. ఈ ప్రక్రియతో రానున్న రోజుల్లో భూముల రిజిస్ట్రేషన్, హక్కుదారుల గుర్తింపుతో పాటు పలు సమస్యలను మరింత సులువుగా పరిష్కరించవచ్చని భావిస్తున్నారు.

విలీన గ్రామాల్లో రికార్డుల పరిశీలన



ఇప్పటివరకూ ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గంలోని 15 గ్రామ పంచాయతీల రికార్డుల పరిశీలన జరిగింది. డ్రోన్ సర్వే సైతం పూర్తి చేశారు. ఇప్పుడు వెంకటాపురం, సత్రంపాడు, తంగెళ్లమూడి, చొదిమెళ్ల, పోనంగి, కొమడవోలు, శనివారపుపేట ప్రాంతాల్లో భూముల రికార్డులను సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే డ్రోన్ సర్వే చేపడతాం.

– బి సోమశేఖర్, తహసీల్దార్

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్యనిర్వహణాధికారి చిన నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేవదాయ, ధర్మాదాయ శాఖ ధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించారు. స్థానిక మెయిన్ బజారులోని రంగ్రీజుల మఠం వద్ద శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో రంగ్రీజులు, భక్తుల సమక్షంలో ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే నగరంలోని శ్రీ తలాటం పట్టయ్య సుబేదారు సత్రం నిధులతో స్థానిక పాత బస్టాండు సమీపంలోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానం వద్ద మరో మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల ఆశయాల మేరకు ఏటా ఆయా సంస్థల నిధులతో మజ్జిగ చలివేంద్రాలు నిర్వహిస్తూ ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రౌడీయిజం చేస్తే.. తాట తీస్తాం

ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ హెచ్చరిక



ఏలూరు టూటౌన్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్ : ఏలూరు టూటౌన్ పరిధిలో ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాలతో ఆదివారం ఏలూరు టూటౌన్‌లోని రౌడీషీటర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారిపై కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తాం.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తాం.. అంటే సహించేదిలేదన్నారు. నగరంలో సెటిల్మెంట్‌లు, దందాలు, గొడవలు చేస్తామంటే తాట తీస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లుగా జీవించడం వల్ల మీ కుటుంబాలకు, పిల్లలకు ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ఇకనైనా చెడు నడవడిక విడనాడి మంచి ఉపాధి చూసుకుని జీవనం సాగించాలని హితవు పలికారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మీరంతా మారితే మీపై రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. రౌడీషీటర్ల కౌన్సెలింగ్ కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై కె.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి



సభలో అభివాదం చేస్తున్న సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆర్ఆర్‌పేట పార్కు వద్ద సీపీఐ, సీపీఎం నగర కమిటీల ఆధ్వర్యంలో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార భేరి యాత్రలో భాగంగా ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. మోదీ, అమిత్‌షా నాయకత్వంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేష చిచ్చు రాజేస్తున్నాయని విమర్శించారు. మహిళలు, దళితులు, మైనార్టీలు, గిరిజనులకు దేశంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, ప్రత్యేక హోదా అమలు, విభజన హామీలు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తదితర అనేక అంశాల్లో రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసిందన్నారు. సీపీఎం నాయకులు పి.కిషోర్, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, ఎ.శ్యామలరాణి, పి.ఆదిశేషు, బి.సాయిబాబు, జి.రవికిషోర్, సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, కడుపు కన్నయ్య, ప్రసాద్, సుభేదార్ ఖాన్, కొండేటి రాంబాబు పాల్గొన్నారు.

మే 2 నుంచి కావూరిలో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్) : ఏలూరు వసంత మహల్ సెంటర్‌లోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో మే 2 నుంచి టైపు, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన (పరీక్షలు రాసిన) వారికి టైపు, డీసీఏ, డీటీపీలోనూ, ఇంటర్ కామర్స్ ఉత్తీర్ణులైన వార్కి టాలీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 24 నుంచి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందచేయనున్నట్లు తెలిపారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాలకు చెందిన 35 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, ప్రధాన కలశ స్థాపన, చతుస్థానార్చన, ప్రధాన మూలమంత్ర హవనాలు నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతి, మంగళ శాసనాలు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి శ్రీ విష్వక్సేనారాధన, పుణ్యాహవచన చతుఃస్థానార్చన, ప్రధాన మూల మంత్ర హవనాలు, లఘు పూర్ణాహుతి, మంగళాశాసనాలు పలికారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు



రాత్రివేళల్లో బ్రీత్ ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షిస్తోన్న పోలీసులు

ఏలూరు టౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో నగరంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటంతో మీరు ప్రమాదాల బారిన పడడమే కాకుండా ఇతరులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందన్నారు. మీ కుటుంబ సభ్యులు, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సరైన జీవన విధానంతో మెలగాలని హితవు పలికారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో నిత్యం వాహన తనిఖీలు ఉంటాయనీ, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఏలూరు వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ, ఏలూరు రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

18 మందిపై కేసు నమోదు

ఏలూరు వన్‌టౌన్ పరిధిలో ఆదివారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తోన్న 18 మందిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ మందుబాబులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవిస్తూ ఇష్టారాజ్యంగా తిరుగుతూ ఉంటే సహించేదిలేదనీ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	42
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	60
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	18
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

వైభవంగా లక్ష్మీ కుబేర హోమం



విశేష చందన అలంకరణలో శ్రీ పాండురంగస్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో లక్ష్మీ కుబేర హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండు సమీపంలోని శ్రీ పాండురంగ స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, తేనె, మంగళ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం గణపతి హోమం, లక్ష్మీ నరసింహ హోమం, నారాయణ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అలాగే శ్రీ మహాలక్ష్మీ సమేత కుబేర స్వామి పూజ, లక్ష్మీ కుబేర హోమం, మహా పూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా శ్రీ పాండురంగ స్వామి వారి నిజరూప దర్శనం అనంతరం చందన అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆలయ అర్చకులు దండిభొట్ల కనకసుందర శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో లక్ష్మీ దేవి స్థిర నివాసం, అష్టలక్ష్మీ అనుగ్రహం, ధన, ధాన్య సమృద్ధి నిమిత్తం సామూహిక లక్ష్మీ కుబేర వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్రం అర్చకులు గంటసాల రామకృష్ణ విశేష పూజలు నిర్వహించగా, వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మత బోధనలు ప్రజలకు తెలియజేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ధార్మిక సంస్థలు తమ మత గ్రంథాల్లో ఉన్న ఒకేలాంటి బోధనలను ప్రజలకు తెలియపరచాలని అప్పుడే మతంపై ఇతరులకు గౌరవం పెరుగుతుందని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నయీముల్లా అన్నారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఈద్ మిలాప్ (గెట్ టు గెదర్)కార్యక్రమాన్ని తంగెళ్ళమూడి దర్స్గా ఇస్లామీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జమాతే ఇస్లామీ హింద్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న నయీముల్లా ప్రసంగిస్తూ ఇతర మతస్తులు కూడా తమ పండుగల సమయంలో గెట్ టు గెదర్ కార్యక్రమాలు నిర్వహిస్తే అపోహలు తొలగి దేశంలో మత ఘర్షణలు తగ్గి శాంతి నెలకొంటుందన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తోందన్నారు. బ్రహ్మకుమారిస్ ప్రతినిధి బీకే మమత, బిషప్ కే. శాంతి సాగర్, మేతర అజయ్ బాబు ప్రసంగిస్తూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ కలిగిస్తోందని ఎవరికి నచ్చిన మతం వారు పాటించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ ఇలియాస్ పాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఖాజా మొయినుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీఅక్బర్, ఎండీ అలీమ్, మహమ్మద్ ముజాహిద్, ఎండీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ద్వారకాతిరుమల : మండల పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 21 మోటార్‌సైకిళ్లకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలాన్ని నిర్వహిస్తామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ వేలం పాటలను జరుపుతామన్నారు. ఆసక్తిగల వారు తమ ఆధార్ కార్డులతో ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఐదు మట్టి ట్రాక్టర్ల సీజ్

జంగారెడ్డిగూడెం : పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు మట్టి ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. అక్రమంగా మట్టి రవాణాచేస్తున్న వేగవరం గ్రామంలో రెండు మట్టి ట్రాక్టర్‌లను, అలాగే పట్టిన్నపాలెం గ్రామంలో మూడు మట్టి ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. వీటిపై స్థానిక తహసిల్దార్‌కు నివేదిక ఇచ్చినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు.

బీసీలకు అధిక సీట్లు కేటాయించిన వారికే మద్దతు

జంగారెడ్డిగూడెం : సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ నాయకులు కోరారు. పట్టణంలోని సూర్య విద్యాసంస్థల్లో ఆదివారం బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం బీసీ చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మల్లవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కులాలకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బీసీ నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన చేపట్టాలని దానికి త్వరలో ఏలూరు కేంద్రంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాలు జనాభా దామాషా ప్రకారం బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని, అలాగే బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన పార్టీలకే మద్దతు తెలియజేస్తామని చెప్పారు. బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి ప్రతి బీసీ వ్యక్తి హాజరయ్యేలా గ్రామాల్లో చైతన్యం చేయాలని తీర్మానం చేశారు.